క్లుప్తంగా

19న శ్రీపార్వతీదేవి అమ్మవారికి శాకంబరి అలంకరణ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈ నెల 19వ తేదీన మూల నక్షత్రం సందర్భంగా శ్రీపార్వతీదేవి అమ్మవారికి శాకంబరి అలంకరణ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఏఐను పాఠ్యాంశాలుగా చేర్చాలి



గన్నవరం: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఏఐ సంబంధిత సబ్జెక్టులను పాఠ్యాంశాలుగా అందుబాటులోకి తీసుకురావాలని మౌంట్‌ఫోర్ట్ హైదరాబాద్ ప్రావిన్సియల్ సుపీరియర్ బ్రదర్ ఫైన్ అలెక్స్ పేర్కొన్నారు. స్థానిక విఎస్.సెయింట్ జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అలెక్స్ మాట్లాడుతూ ఆధునిక విద్యా వ్యవస్థలో క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సీనియర్ బ్రదర్లు జిమ్మి కురియోకోస్, భల్లా జోసఫ్, జయబాలన్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.15 వేల నగదు అపహరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఓ వృద్ధురాలికి చెందిన రూ. 15వేల నగదును అపహరణకు గురైన ఘటన దుర్గగుడిపై చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కేరళకు చెందిన వరలక్ష్మి.. అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆమె చేతిలో సెల్‌ఫోన్ ఉండటంతో మహామండపం వద్ద సిబ్బంది అడ్డుకున్నారు. సెల్‌ఫోన్‌ను కౌంటర్‌లో పెట్టాలని చెప్పడంతో వరలక్ష్మి క్యూలోకి వెళ్లారు. చేతిలో ఉన్న సంచితో ప్లాస్టిక్ కవరును పట్టుకుని ఉన్నారు. క్యూ ముందుకు కదిలే క్రమంలో ఆమె చేతిలో కవరు జారిపోయింది. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆ కవరు తీసుకునివెళ్లిపోయినట్లు వరలక్ష్మి చెబుతున్నారు. ఆ కవరులో తన భర్త పెరుమాళ్ ఆపరేషన్ కోసం గన్నవరంలో ఉన్న తన తమ్ముడు నారాయణ ఇచ్చిన రూ.15 వేలు ఉన్నాయని ఆమె తెలిపారు. వరలక్ష్మి కన్నీటి పర్యంతం కావడంతో అక్కడి సిబ్బంది మహామండపం ఏడో అంతస్తులోని పోలీస్ అవుట్‌పోస్టుకు తీసుకెళ్లారు. పోలీసు సిబ్బంది సీసీ కెమెరాలో ఫుటేజీ చూసి నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

మహిళల్లో రుగ్మతలపై అవగాహన



పటమట(విజయవాడతూర్పు): మహిళల్లో హార్మోన్ల ప్రభావంతో అనేక రుగ్మతలు సంభవించే అవకాశం ఉందని దీనిపై యువతులు, మహిళలు అవగాహన పెంచుకోవాలని గైనకాలజిస్ట్ డాక్టర్ వర్ష పాటిల్ అన్నారు. నగరంలోని స్టెల్లా కళాశాలలో మంగళవారం కాలేజీ ఫౌండేషన్ డే సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపడం, లైఫ్ స్టైల్ డిజార్డర్స్ రుతు క్రమ సంబంధిత సమస్యలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉష కుమారి, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ లిటిల్ ఫ్లవర్, స్టూడెంట్ డీన్ డాక్టర్ వీఎస్ మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వరిసాగు

- సిద్ధంగా ఉన్న నారుమళ్లు
- రైతులకు కలిసొచ్చిన వర్షం
- గ్రామాల్లో హడావుడిగా వ్యవసాయ పనులు



నారుమళ్లు పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయకుడు షరీఫ్



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ శైలజ



పెదపులిపాకలో నాట్లు వేస్తున్న కూలీలు

పెనమలూరు: మండల పరిధిలో వ్యవసాయ పనులు విస్తారంగా సాగుతున్నాయి. సార్వ వరి సాగు ఊపందుకుంది. గత మూడు రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు. వివరాల్లోకి వెలితే గత రెండు నెలలుగా ఎండ వేడి ఉండటం, వర్షాలు కురవకపోవడంతో సార్వ వరి సాగుపై రైతుల్లో ఆందోళన నెలకొంది. బోర్లతో నారు మళ్ల వేశారు. అయితే వర్షాలు కురవకపోవడంతో నాట్లు సకాలంలో వేయగలమా లేదా అనే అనుమానంతో ఉన్నారు. కాగా గత మూడు రోజులుగా మండల పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. నారుమళ్లు సిద్ధంగా ఉండటంతో రైతులు వరి నాట్లకు ఉక్రమించారు.

2,694 హెక్టార్లలో సాగు..

మండల పరిధిలో వ్యవసాయ సాగు దాదాపు 2,694 హెక్టార్లలో జరుగుతుంది. ఇందులో వరి సాగు 2,511 హెక్టార్లలో జరుగుతుంది. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ వరి నాట్లు పడతాయి. అయితే ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా రావడంతో ఇప్పుడిప్పుడే వ్యవసాయ సాగు మొదలైంది. ఇప్పటివరకు 326 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. వెద పద్ధతిలో 105 హెక్టార్లలో సాగు చేపట్టారు. ప్రధానంగా ఎంటీయూ–1318 రకం 70 శాతం, ఎంటీయూ–1061 రకం 25 శాతం, మిగితా సాగు ఎంటీయూ 1,262 విత్తనంతో సాగు చేయనున్నారు. ఇప్పటికే రైతులకు విత్తనాలు సకాలంలో ఇవ్వడం, నారుమళ్లు వేయడంతో నాట్లకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు కురవడంతో నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

వరిసాగు చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నాట్లు వేసే సమయంలో గాలి, వెలుతురు బాగా వచ్చేవిధంగా నాట్లు వేయాలి. దీని వల్ల పురుగులు, తెగుళ్లు రావు. బాగా దుబ్బు చేసి అధిక దిగుబడులు వస్తాయి. ఎరువులు ఎలా వాడాలనే విషయమై ఆయా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలి. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు వచ్చేవిధంగా రైతులు ప్రణాళికతో ఉండాలి.

కే శైలజ, మండల వ్యవసాయాధికారిణి, పెనమలూరు.

కుష్టు వ్యాధి లక్షణాలు గుర్తించడంపై శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్‌రెడ్డి

ఉంగుటూరు: స్వీయ పరీక్ష నిర్వహించుకోవడం వల్ల కుష్టు వ్యాధి లక్షణాలు తెలుసుకోవచ్చని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ మనోహర్‌రెడ్డి అన్నారు. ఆత్కూరు పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించడంపై ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైకో బ్యాక్టీరియం లేప్రే అను బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు. ఇవి తుమ్మడం, దగ్గడం వల్ల గాలి ద్వారా వ్యాప్తి చెందుతాయని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించడానికి ఐదు నుంచి ఏడు సంవత్సరాలు పట్టవచ్చని అన్నారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఆశావర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. వ్యాధి లక్షణాలు చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు వంటి పలు లక్షణాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.జితేంద్ర కుమార్, యస్ ఎల్‌పీ నోడల్ ఆఫీసర్ నాగ మల్లేశ్వరరావు, ఎంపీహెచ్ఓ సాంబశివరాజు, కుమారి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని భవానీపురం ఎస్ఐ జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. భవానీపురం శివాలయం రోడ్డులోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం విద్యార్థి మండలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్యఅతిథి జగన్‌మోహన్‌రావు ఎన్నికైన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ వారిలో ప్రతిభను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమాజానికి సేవలందించడానికి విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాధ మాట్లాడుతూ చిన్నారులు సన్మార్గంలో నడిచేలా దిశానిర్దేశం చేస్తే నాయకులుగా తయారవుతారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల జీఎం శివారెడ్డి, ఏజీఎం కేశవరాజు, డీన్ మీనాక్షి శైలజ, ఇన్‌చార్జ్ రాఘవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగజ్జననికి ఆషాఢ సారె సమర్పణ

తరలివస్తున్న భక్త బృందాలు



అమ్మవారి ఉత్సవ మూర్తి



అమ్మవారికి సారె సమర్పించిన భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా జగజ్జననికి మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తబృందాలు సారె సమర్పించాయి. విజయవాడకు చెందిన శ్రీదుర్గా శివసాయి సేవా సంఘానికి చెందిన రెండు వందల మంది, రాధా మాధవి భక్త బృందానికు చెందిన వంద మంది, దుర్గాభవాని బృందానికి చెందిన 60 మంది, అరుణ బృందం 60 మంది, వంశీ బృందం 30 మంది, యనమలకుదురుకు చెందిన సోమేశ్వరరావు బృందానికి చెందిన 40 మంది ఇలా అనేక మంది భక్తులు ఇంద్రకీలాద్రికి వచ్చి సారె సమర్పించారు. విశాఖపట్నానికి చెందిన అన్నమాచార్య సేవా సమితి బృందానికి చెందిన 50 మందితో పాటు ఇతర ప్రాంతాల నుంచి మరికొన్ని సంఘాలు ఇంద్రకీలాద్రికి విచ్చేశాయి. భక్త బృందాలను ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని దర్శించుకుని సారె సమర్పించారు.

పాండురంగడి కల్యాణోత్సవాలు ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పాతబస్తీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న సంతాన వేణుగోపాలస్వామి వారికి కూడా తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు ఉభయ దాతలు తదితరులు పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు, మురళీకృష్ణ తదితరులు నిర్వహించారు.

సౌత్‌జోన్ త్రోబాల్ పోటీలకు నలంద విద్యార్థిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): బెంగుళూరులో ఆగస్టు 3 నుంచి 7 వరకూ జరగనున్న 16వ సౌత్ జోన్ నేషనల్ త్రోబాల్ పోటీలకు నలంద విద్యానికేతన్ విద్యార్థిని దిషా రాతి ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన నేషనల్ ప్రాబెల్స్ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 160 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. తమ పాఠశాలలో 12వ తరగతి విద్యార్థిని దిషా రాతి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని దిషా రాతిని అభినందించారు.

చోడవరంలో ఆగని అక్రమ లేఅవుట్లు



పంట పొలంలో రోడ్డు వేస్తున్న దృశ్యం

పెనమలూరు: చోడవరం గ్రామంలో అక్రమ లేఅవుట్ల దందాను అడ్డుకునే నాథుడు కనబడటం లేదు. పంట పొలంలో పట్టపగలే రోడ్లు వేస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారు. చోడవరం గ్రామంలో కృష్ణా నది కరకట్ట దిగువన అధికార పార్టీ నేతల అండదండలతో పంట పొలంలో అక్రమ లేఅవుటు వేస్తున్నారు. పంట పొలాల్లో లేఅవుటు వేయాలంటే తొలుత రెవిన్యూ శాఖకు నాలా చెల్లించాలి. ఆ తర్వాత సీఆర్‌డీఏ అనుమతులు తీసుకుని ఎల్‌పీ నెంబర్ పొందాలి. అలాగే రిక్రియేషన్‌కు కామన్ సైట్ వదలాలి. వాస్తవానికి కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో లేఅవుట్లకు అనుమతులు ఇవ్వరు. ఈ నిబంధనలు అన్ని తుంగలో తొక్కి బాహాటంగా కరకట్ట దిగువన అక్రమ లేఅవుటు వేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటంతో గ్రామస్తులు విమర్శిస్తున్నారు. చట్ట విరుద్ధంగా లేఅవుట్లు వేసి అమాయక ప్రజలను మోసం చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికైనా సీఆర్‌డీఏ, రెవిన్యూ అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా డొంక రోడ్డు



గోతుల్లో వర్షపునీరు నిలిచి ప్రమాదకరంగా మారిన డొంక రోడ్డు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు శ్రీ శక్తి కల్యాణ మండపం మీదుగా కానూరు వెళ్ల డొంక రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రోడ్డు ధ్వంసమై గోతులమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ మార్గంలో పలు గోదాములు, కంపెనీలు, కళాశాల ఉండటంతో నిత్యం కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ రోడ్డు మొత్తం పెద్ద పెద్ద గోతులు ఏర్పడి రాళ్లు పైకి తెలి ఉండటంతో ప్రయాణికులు తరుచూ ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గోతుల్లో వర్షపునీరు నిలిచి మరింత ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రయాణికులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పరిశుభ్రమైన తాగునీటి సరఫరాకు చర్యలు



మైక్రోఫిల్టర్‌లో క్లోరినేషన్ లిక్విడ్ కలుపుతున్న దృశ్యం

నున్న(విజయవాడరూరల్): వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా డయేరియా విస్తరిస్తుండటంతో పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి రోజూ తాగునీటి ట్యాంకుల్లో తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో నున్న గ్రామంలో మైక్రోఫిల్టర్ బెడ్స్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో క్లోరినేషన్ లిక్విడ్‌ను కలుపుతున్నారు. మినరల్స్‌కు నష్టం జరగకుండా ఉండే విధంగా మైక్రోఫిల్టర్స్‌తో శుభ్రమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ప్రతి గంటన్నర సమయానికి ఆరు లీటర్ల క్లోరినేషన్ జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి జిటివి.రమణ తెలిపారు. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా తాగునీరు కలుషితమయ్యే ఆస్కారం ఉండదని చెప్పారు. అలాగే డ్రైనేజీ కాల్వల్లో మురుగునీరు నిలబడకుండా కార్మికులతో వ్యర్థాలను తొలగించడం, దోమల నివారణకు ఫాగింగ్ స్ప్రే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. గ్రామంలో పది వేల లీటర్ల సామర్థ్యం గల 22 మినీ వాటర్ ట్యాంక్‌ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోంది. గన్నవరం నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా నున్న గ్రామంలో మైక్రోఫిల్టర్ బెడ్స్ ద్వారా తాగునీరు సరఫరా జరుగుతుంది.

ఘనంగా కార్మెల్‌మాత మహోత్సవం



దివ్యబలి పూజ నిర్వహిస్తున్న భక్తులు

పెనమలూరు: కానూరు కార్మెల్ మాత పుణ్యక్షేత్ర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విచారణ గురువు ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో నవ దిన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో చేశారు. విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు దివ్యబలి పూజలు చేసి వెయ్యి మంది విశ్వాసకులకు దివ్య ప్రసాదం అందజేశారు. పది, ఇంటర్‌లో మార్కులు ఎక్కువ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్లు దేవదానం, రత్నరాజు, ఆనంద్, సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, కౌన్సిల్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులు వేసిన మేరీమాత వేశదారణ అందరిని ఆకట్టుకుంది.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి హరిచంద్

హనుమాన్‌జంక్షన్ రూరల్: కొత్తగా ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్ అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలో ఉద్యాన శాఖ, పతాంజలి ఫుడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తోటల సాగుపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టిన రైతులకు దేశీయ మొక్కలకైతే హెక్టారుకు రూ. 20 వేలు, విదేశీ మొక్కలకై తే హెక్టారుకు రూ. 29 వేలు చొప్పున ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తర్వాత నాలుగేళ్ల పాటు ఏటా హెక్టారుకు రూ. 5,250 ప్రోత్సాహకాన్ని అందిస్తామని పేర్కొన్నారు. అంతేకాక ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, పతాంజలి ఫుడ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

పటమట(విజయవాడతూర్పు): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు వీఎంసీ నిరంతరం కృషి చేస్తుందని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ అన్నారు. సఫాయి కర్మచారి అసోసియేషన్ అండ్ ట్రీస్ గ్రూప్ మంగళవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో ఆయన్ను కలిసి తాము నిర్వహించే కార్యక్రమాలకు వీఎంసీ సహకారం అందించాలని వినతిపత్రం అందించారు. అసోసియేషన్ తరపున 2,200 మంది యువతి యువకులతో కలిసి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆర్గానిక్ పద్ధతిలో 15 లక్షల ఫలాల మొక్కలను నాటే విధంగా ప్రయతిస్తున్నామన్నారు. అందులో వీఎంసీ భాగస్వామి కావాలని కోరగా అందుకు ఆయన సహకరిస్తామని పేర్కొన్నారు. ఈసమావేశంలో సఫాయి కర్మ చారి అసోసియేషన్ అండ్ ట్రీస్ గ్రూప్ స్టేట్ ప్రెసిడెంట్ బండి కాళేశ్వరరావు, కోఆర్డినేటర్ మురళి, సెక్రటరీ దుర్గారావు, సభ్యులు ఫిలిప్స్ కారంగి, కొమర వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న నాట్లు



కంకిపాడులో వరి నాట్లు వేస్తున్న కూలీలు



పోరంకిలో నారుతీస్తున్న కూలీలు



ఈడుపుగల్లులో వరి నాట్లకు నీరు పెడుతున్న దృశ్యం

ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలు, బోర్ల సదుపాయంతో రైతాంగం వరి నాట్లను వేగవంతం చేశారు. పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా వరి నాట్లు, నారుతీత, పొలాలకు నీరు పెట్టడం, దమ్ము చేయడం వంటి పనులను చేపడుతున్నారు. దివిసీమ, ఖమ్మం, రేపల్లె ప్రాంతాల నుంచి వచ్చిన వలస కూలీలతో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి.

- కంకిపాడు



పునాదిపాడులో పొలం దమ్ము చేస్తున్న రైతు



దావులూరులో మొక్క ఎదుగుదలకు ఎరువు చల్లుతున్న రైతు